రేవంత్.. దమ్మొంటే మాతో కొట్లాడు!

మొదటిపేజీ తరువాయి...

న్యాయపోరాటం చేస్తామని, బెయిల్ వచ్చే వరకు వారి వెన్నంటే ఉంటామని భరోసా ఇచ్చారు. రేవంత్‌రెడ్డి సొంత జిల్లా, సొంత నియోజకవర్గ రైతులు, ప్రజలు కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా మర్లబడ్డారని, రేపు తెలంగాణ మొత్తం రేవంత్ సర్కార్‌పై మర్లబడతదని హెచ్చరించారు. కొడంగల్, న్యాల్‌కల్ ఎక్కడైనా ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే అక్కడి రైతులకు అండగా బీఆర్‌ఎస్ పోరాడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా కంది లోని సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న లగచర్ల గ్రామానికి చెందిన 16 మందిని మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, అనిల్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జాన్సన్‌నాయక్‌తో కలిసి కేటీఆర్ పరామర్శించారు. జైలులో ఉన్న 16 మంది రైతులతో నాలుగు విడతలుగా నలుగురు చొప్పున రైతులతో ఆయన ములాఖత్‌లో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

బీఆర్‌ఎస్ వారిపైనే కేసులు

కేసీఆర్ సేకరించిన 14వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయకుండా రియల్ ఎస్టేట్ దందా చేస్తానని, అన్నలు, తమ్ముళ్లకు భూముల సంతర్పణ చేస్తానని, ఫార్మా విలేజ్‌ల పేరిట సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్, కొడంగల్‌తోపాటు 20 ఫార్మావిలేజ్‌లు పెడతామంటూ రేవంత్ వికృత పోకడలకు పోతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. లగచర్ల ఘటనలో రేవంత్ సర్కార్ కాంగ్రెస్ వాళ్లను తప్పించి బీఆర్‌ఎస్ వారిపైనే అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. రూ. 60 నుంచి రూ. 70 లక్షలు పలికే లగచర్ల భూములను అడ్డికిపావుసేరుకు లాక్కుంటామని చెప్తుండడంతోనే రైతులు, ఆడబిడ్డలు 9 నెలలుగా ఆందోళన చేస్తున్నారని వివరించారు. లగచర్లలో 70 మందిని అరెస్ట్ చేశారని, కాంగ్రెస్ పార్టీకి చెందిన రమేశ్, నర్సింహులు, రాములు నాయక్ తదితరులు కూడా నిరసనలో పాల్గొన్నారని తెలిపారు. రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి రాజకీయ ఒత్తిడితో కాంగ్రెస్ వారిపై కేసులు లేకుండా చేశారని, దుద్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ ఇందుకు సహకరించారని పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన వారిలో బీఆర్‌ఎస్‌కు చెందిన 21 మందిని మాత్రమే రిమాండ్ చేసి, కాంగ్రెస్ వారిని వదిలేశారని ఆరోపించారు. అరెస్ట్ చేసిన వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేశారని పేర్కొన్నారు. వారి కాళ్లు, చేతులు కమిలిపోయి ఉండడాన్ని ములాఖత్‌లో తాను గమనించానని తెలిపారు. బిన్‌లాడెన్ వంటి వారిని పట్టుకునేందుకు వెళ్లినట్టుగా లగచర్ల గ్రామంలోని రైతుల ఇండ్లపైకి పోలీసులు వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు రైతుల ఇండ్ల తలుపులు పగలగొట్టారని, కాంగ్రెస్ నాయకులు కొందరు రైతుల ఇండ్లలోని ఆడవారిని బూతులు తిడుతూ దాడులు చేశారని ఆయన ఆరోపించారు.

సంగారెడ్డి జిల్లా కంది జైల్‌లో లగచర్ల రైతులను పరామర్శించి బయటకు వస్తున్న కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, మాణిక్‌రావు, చింతాప్రభాకర్, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, బాల్కసుమన్, రవీంద్రనాయక్, బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

కాంగ్రెస్ పాలనలో సంక్షేమం మాయం

కాంగ్రెస్ పాలనలో సంక్షేమం మాయమై పేదల బతుకులు ఛిద్రమయ్యాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. పనిమంతుడు పందిరేస్తే..కుక్క తోక తగిలి కూలిందన్నట్టుగా రేవంత్ పాలన సాగుతున్నదని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం సమున్నతంగా వెలిగితే, రేవంత్‌పాలనలో మృగ్యమైందని ఆవేదన వ్యక్తంచేశారు. సంక్షేమ గురుకుల పాఠశాలల ఆహార బిల్లులు, అద్దెలు చెల్లించకపోవడంతో వాటికి తాళాలు వేస్తే 9 నెలలకు 3 నెలల బిల్లులు చెల్లించిన ఉదంతాలను గుర్తుచేశారు. 11 నెలల పాలనలో సంక్షేమ గురుకుల పాఠశాలల నిర్వహణ గాలికి వదిలేశారని మండిపడ్డారు. గురుకులాల్లో చదివే 36 మంది విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారని, వందలాది గురుకుల పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థులు రోడ్డెక్కుతున్నారని పేర్కొన్నారు. పత్తి, వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టక ఆందోళన చేసినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో రైతన్నలు అడ్డికి పావుశేరు చొప్పున తమ కష్టార్జితాన్ని అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో హైదరాబాద్ పేదల బతుకుల్లో నిప్పులుపోసి కంటికి మీద కునుకు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మాసిటీకి సేకరించిన భూమిని పక్కన పెట్టి ఫార్మా క్లస్టర్ల పేరుతో గిరిజనుల జీవితాల్లో భయాన్ని నింపారని పేర్కొన్నారు. 'మా భూములు మాకేనని' ఎదిరించిన వారిని అక్రమ కేసులతో జైళ్లకు పంపుతున్నారని మండిపడ్డారు. '11 నెలల పాలనలో సంక్షేమం మాయమయింది. అభివృద్ధి ఆగిపోయింది. కాంగ్రెస్ తెచ్చిన మార్పు చూసి తెలంగాణ నివ్వెరపోతున్నది. కాలంబు రాగానే కాటేసి తీరాలని ఎదురుచూస్తున్నది' అని హెచ్చరించారు.

ప్రభుత్వ ఉద్యోగిని కూడా జైలులో వేశారు

లగచర్ల ఘటనలో అరెస్టు చేసి సంగారెడ్డి జైలులో ఉన్న వారిని చూస్తుంటే కన్నీరు వచ్చిందని, ఒక్కొక్కరు కనీసం 40 కేజీల బరువు కూడా లేరని, బట్టలు కూడా సరిగ్గా లేవని, అలాంటి పేద రైతులపై అక్రమ కేసులు పెట్టేందుకు రేవంత్‌రెడ్డికి మనసెలా ఒప్పిందని కేటీఆర్ ప్రశ్నించారు. కలెక్టర్‌ను కొట్టారని, హత్యకు ప్రయత్నించారని వారిపై కేసులు పెట్టడం దారుణమని పేర్కొన్నారు. తమను అన్యాయంగా జైలులో వేశారని 16 మంది తన ఎదుట కన్నీరు పెట్టుకున్నారని పేర్కొన్నారు. వారిని ఇంతకుమించి ఇంకేమీ చేయలేరని, వారి తరఫున బీఆర్‌ఎస్ పార్టీ పోరాడుతుందని హామీ ఇచ్చారు. రాఘవేంద్రయాదవ్ ఉద్యోగం పోకుండా చూస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని హామీ ఇచ్చినట్టు చెప్పారు. లగచర్ల బాధితులకు కేసీఆర్, బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని ఎవరి బెదిరింపులకు భయపడవద్దని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

> లగచర్లలో 70 మందిని అరెస్ట్ చేశారు. వారిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన రమేశ్, నర్సింహులు, రాములునాయక్ తదితరులు కూడా ఉన్నారు. అరెస్ట్ చేసిన వారిలో బీఆర్‌ఎస్‌కు చెందిన 21 మందిని మాత్రమే రిమాండ్ చేసి, కాంగ్రెస్ వారిని వదిలేశారు. రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి రాజకీయ ఒత్తిడితో కాంగ్రెస్ వారిపై కేసులు లేకుండా చేశారు.
> - కేటీఆర్

రైతుల పక్షాన నిలబడి పోరాడుతం

ఫార్మావిలేజీ పేరుతో రేవంత్ సర్కార్ భూములు లాక్కునే ప్రయత్నం చేస్తే.. తాము బాధిత రైతులు పక్షాన నిలబడి పోరాడతామని కేటీఆర్ తెలిపారు. ఫార్మా విలేజీల ఏర్పాటుకు వ్యతిరేకంగా కొడంగల్, సంగారెడ్డి జిల్లాలోని న్యాల్‌కల్ రైతులు ఆందోళనలు చేస్తున్నట్టు చెప్పారు. మరో 18 చోట్ల ఫార్మా విలేజీలు పెట్టేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. న్యాల్‌కల్, కొడంగల్ రైతులు ధైర్యంగా ఉండాలని, వారివెంట కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ ఉంటుందని తెలిపారు. కొడంగల్ రైతులకు న్యాయంగా, ప్రజాస్వామ్యబద్ధంగా రావాల్సింది ఇప్పించే వరకు వెంట ఉంటామని హామీ ఇచ్చారు. లగచర్ల దాటి ఘటనలో జ్యోతి అనే గర్భిణి కూడా ఉందని, సత్యవతి రాథోడ్ ఆమెను పరామర్శించి దవాఖానకు తీసుకెళ్తారని కేటీఆర్ తెలిపారు.

అన్ని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు: అనిల్ జాదవ్

లగచర్ల రైతులకు మద్దతుగా రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ఎదుట గిరిజన సంఘాల తరపున ధర్నాలు చేస్తామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. లగచర్ల ఘటనలో గిరిజనులపై అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు బలవంతంగా భూములు లాక్కుని లాఠీచార్జీలు చేసి అక్రమ కేసులు బనాయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.60 లక్షల విలువ చేసే భూమి రూ.10 లక్షలకు లాక్కోవడం అన్యాయమని అన్నారు. రేవంత్ సర్కార్‌కు ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

రేవంత్‌రెడ్డి గిరిజనులను పావులా వాడుకున్నారు: సత్యవతిరాథోడ్

లగచర్ల ఘటన బాధాకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. కొడంగల్‌లో రైతులను మెప్పించి ఫార్మాసిటీ ఏర్పాటు చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైనట్టు చెప్పారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కుట్రపూరితంగా రైతులు, గిరిజనులపై కేసులు పెట్టి జైలుకు పంపారని మండిపడ్డారు. కంది జైలులో ఉన్న 16 మందిని పోలీసులు తీవ్రంగా హింసించారని, వారు నడవలేకపోతున్నారని పేర్కొన్నారు. వారిని అలా చూస్తుంటే తనకు ఏడుపు ఆగడం లేదన్నారు. పేదలు, గిరిజనులను పావులా వాడుకుని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు గిరిజనులను ఇబ్బందులకు గురిచేయటం సిగ్గుచేటన్నారు. గిరిజనులు, ఎస్సీలు, పేదలకు అసైన్డ్ భూములపై హక్కులు కల్పిస్తామని ఇప్పుడు ఫార్మా కంపెనీల ముసుగులో భూములు లాక్కోవడం అన్యాయం పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి మూల్యం చెల్లించుకోక తప్పదు: శ్రీనివాస్‌గౌడ్

కొడంగల్ రైతుల ఉసురు పోసుకుంటున్న రేవంత్‌రెడ్డి త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 14 లక్షల మంది వలసలు వెళ్లేవారని, అందులో ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఓసీ అన్నివర్గాల ప్రజలు ఉండేవారని తెలిపారు. కేసీఆర్ సీఎం అయ్యాక మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు ప్రస్తుత కొడంగల్ నియోజకవర్గంలో వలసలు తగ్గాయని పేర్కొన్నారు. ముంబై, పూణెలో ఉన్నవాళ్లు తిరిగి స్వగ్రామానికి వచ్చి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నట్టు చెప్పారు. అలా కొడంగల్ వచ్చిన గిరిజనుల నుంచి ఫార్మాసిటీ పేరుతో రేవంత్ సర్కార్ భూములు లాక్కోవాలని ప్రయత్నించడం దారుణమని మండిపడ్డారు. తమకంటే బాగా పాలిస్తారని నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని, అదే కాంగ్రెస్ ఇప్పుడు అక్రమ కేసులు బనాయిస్తే ప్రజలు, రైతులు ఊరుకోరని, తిరగబడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, వివేకానంద, మాజీ ఎమ్మెల్యేలు కాంత్రికిరణ్, బాల్క సుమన్, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, బీఆర్‌ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, శుభప్రద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బధిరాంధక రేవంత్ ప్రభుత్వం

కండ్లు ఉండి చూడలేని, చెవులు ఉండి వినలేని బధిరాంధక ప్రభుత్వంగా రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ మారిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. పేద గిరిజనుల భూములపై కన్నేసిన కాంగ్రెస్ సర్కార్.. దౌర్జన్యంగా, దాష్టీకంగా గుంజుకుంటున్నదని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు.

'కళ్లుండి చూడలేని
చెవులుండీ వినలేని
బధిరాంధక రేవంత్ ప్రభుత్వపు
దాష్టీకానికి మచ్చుతునక ఇది!

రెక్కాడితేనే కానీ
డొక్కాడని ఆ పేద గిరిజనుల
భూముల మీద కన్నేసిండు రేవంత్.

మా భూములు గుంజుకోవద్దన్నందుకు,
పోలీసులే దొంగలెక్క
అర్ధరాత్రి ఆ నిస్సహాయుల
ఇళ్ల మీద పడ్డారు.

గడ్డపారలతో వారి
ఇండ్ల తలుపులు విరగ్గొట్టారు.

ఇంట్లో ఉన్న బీరువాను కూడా
వదలకుండా పగలగొట్టారు.

కళ్లు సరిగ్గా కనిపించని
ఈ ముసలమ్మ చేతి కర్రను
లాగి విసిరేశారు.

దొరికినవాళ్లను దొరికినట్టు నిర్బంధించి
చిత్రహింసలు పెట్టి, జైళ్లో వేశారు.

ప్రజా ప్రభుత్వం పేరున గద్దెనెక్కి
ప్రజా కంఠకుడిగా మారిన
రేవంత్ నిర్వాకమిది' అని కేటీఆర్ పేర్కొన్నారు. అభాగ్య అంధురాలు తన బాధను వెల్లడించే వీడియోను దీనికి జత చేశారు.

> సీఎం రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి కొడంగల్‌లో రాజ్యాంగేతర శక్తిగా మారారు. ఏ పదవి, హోదా లేకున్నా కలెక్టర్లు, పోలీసు అధికారులు ఆయన ముందు మోకరిల్లుతున్నారు. తిరుపతిరెడ్డి కొడంగల్‌కు చక్రవర్తి, రారాజుగా వ్యవహరిస్తున్నారు. అక్కడ రేవంత్‌రెడ్డిది ఏమీ నడవదట, చెల్లదట.. అంతా తిరుపతిరెడ్డే చూసుకుంటరట.
> -కేటీఆర్

సుమోటోగా తీసుకోవాలి

- లగచర్ల ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించాలి
- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి డిమాండ్
- గిరిజనులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆవేదన

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): కొడంగల్‌లోని లగచర్ల ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించాలని బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11న రాత్రి గ్రామంలోకి వెళ్లిన పోలీసులు లంబాడా బిడ్డలతో దుర్మార్గంగా వ్యవహరించారని స్థానికులు చెప్తున్నారని తెలిపారు. మహిళలతో చాలా నీచంగా వ్యవహరించారని, యువతులు, మహిళలు, వృద్ధుల శరీరభాగాలను తడిమారాని, ఆ ఆడబిడ్డలు చెప్తుంటే కన్నీళ్లు ఆగడం లేదని పేర్కొన్నారు. అర్ధరాత్రి గ్రామంలోకి వెళ్లి గిరిజన మహిళలతో దుర్మార్గంగా వ్యవహరించిన పోలీసులపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించాలని కోరారు. సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

లగచర్లలో ప్రభుత్వానిదే వైఫల్యం

దాడి ఘటనను తప్పుదోవ పట్టించొద్దు • టీవీఎస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): లగచర్లలో గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న రైతుల నిరసనలను పట్టించుకోకపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని తెలంగాణ వికాస సమితి (టీవీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ తేల్చిచెప్పారు. ప్రజల ప్రతిఘటనను ప్రభుత్వం తప్పుదోవ పట్టించవద్దని, పేదల భూములను దురాక్రమణ చేయొద్దని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘటనకు ముందు ప్రజలంతా పార్టీలతీతంగా ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసి విజ్ఞప్తులు చేశారని తెలిపారు. తమ భూములను లాక్కోవద్దని అనేక రకాలుగా వేడుకున్నా ఎవరూ పట్టించుకోలేదనే.. అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారని తెలిపారు. భూసేకరణను చట్టబద్ధంగా, సుప్రీంకోర్టు నిబంధనలకు అనుగుణంగా చేయాల్సి ఉండగా, ప్రభుత్వం బలవంతంగా లాక్కొనే ప్రయత్నంలోనే లగచర్ల ఘటన చోటుచేసుకున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా లగచర్ల రైతులు, యువకులపై పెట్టిన కేసులను ఎత్తేసి, సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయంతి, నాయకులు జీవి, పులిరాజు, రవీందర్, విజయానంద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను అరెస్టు చేస్తే తెలంగాణ భగ్గుమంటది

బీఆర్‌ఎస్‌కు ప్రజా సంక్షేమమే ముఖ్యం: మాజీ ఎంపీ బడుగుల

సూర్యాపేట, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): లగచర్లలో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటే ఎవరూ ఊరుకోరని మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్‌కు ఏం జరిగినా ప్రజాక్షేత్రంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే తెలంగాణ సమాజం భగ్గుమంటది జాగ్రత్త అని తెలిపారు. బాంబులు పేలుతాయంటూ మంత్రులు బెదిరింపులకు గురిచేస్తున్నారని, బీఆర్‌ఎస్ ఉద్యమ పార్టీ అని, తమ నాయకులు ఎవరికీ భయపడరని స్పష్టంచేశారు. రాష్ట్రంలో పాలన వదిలి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అధికారం కోసం కాదు ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్‌కు ముఖ్యమని, ప్రజాశ్రేయస్సుకు భంగం కలిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

లగచర్ల బాధితుల్లో ఉద్వేగం

కేటీఆర్‌ను చూసి ములాఖత్‌లో కన్నీరు

- మమ్మల్ని ఆదుకోవాలని వినతి..
- నేనున్నానంటూ భరోసా ఇచ్చిన నేత
- భారీ కాన్వాయ్‌తో సంగారెడ్డికి కేటీఆర్
- ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు

సంగారెడ్డి, నవంబర్ 15(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కందిలోని సెంట్రల్ జైలుకు శుక్రవారం వచ్చిన కేటీఆర్‌ను చూసి లగచర్ల రైతులు ఉద్వేగానికి గురయ్యారు. ఆయన చేతులు పట్టుకుని కన్నీటి పర్యంతమయ్యారు. కాంగ్రెస్ కుట్రను కేటీఆర్ ఎదుట ఏకరువు పెట్టుకున్నారు. అక్రమంగా జైలులో నిర్బంధించిన తమను ఆదుకోవాలని, తమ కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. జైలులో ములాఖత్‌లో లగచర్ల బాధిత రైతులను కలిసిన కేటీఆర్ ఎవరూ అధైర్య పడవద్దని, కేసీఆర్, బీఆర్‌ఎస్ మీ వెన్నంటి ఉంటుందని ధైర్యం చెప్పారు. జైలులో ఉన్న ప్రతి ఒక్కరినీ బయటకు తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని చెప్పడమే కాదు వెంటనే చేతల్లోనూ చూపించారు. బాధితుల్లోని ఒకరి భార్య అయిన జ్యోతి గర్భిణి అని తెలుసుకుని శనివారం ఆమెను దవాఖానకు తీసుకెళ్లి అవసరమైన సహాయం అందించాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌కు సూచించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని లగచర్ల ఘటనలో అరెస్టు అయిన 16 మందిని పోలీసులు గురువారం రాత్రి సంగారెడ్డి జిల్లా కందిలోని సెంట్రల్ జైలుకు తరలించారు. కేటీఆర్ శుక్రవారం భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్ నుంచి సంగారెడ్డి వచ్చారు. అక్కడ అడుగడుగునా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ములాఖత్‌లో వచ్చిన రైతులతో కేటీఆర్ ముఖాముఖిగా మాట్లాడారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లగచర్ల ఘటన, కేసుల నమోదు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 16 మంది బాధితులు కేటీఆర్‌ను చూసి ఉద్వేగానికి గురయ్యారు. తమపై కాంగ్రెస్ సర్కార్ అక్రమ కేసులు బనాయించి జైలు పాలు చేసిందని కన్నీరు పెట్టుకున్నారు. రాఘవేంద్రయాదవ్ అనే ప్రభుత్వ ఉద్యోగి కేటీఆర్‌తో మాట్లాడుతూ.. తాను పంచాయతీ సెక్రటరీనని, వేరే మండలంలో కులగణనలో పాల్గొని రాత్రికి ఇంటికి రాగా, పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారని, ఉద్యోగం పోతే తన కుటుంబం ఇబ్బందులకు గురవుతుందని, ఉద్యోగం పోకుండా చూడాలని కేటీఆర్‌ను కోరారు. వనపర్తిలో ఐటీఐ చదవుతున్న తాను గ్రామంలో ఉన్న తల్లిదండ్రుల యోగక్షేమాలు తెలుసుకునేందుకు ఇంటికొస్తే, పోలీసులు తనపైనా అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపినట్లు శివకుమార్ అనే విద్యార్థి కేటీఆర్ ఎదుట కన్నీరు పెట్టుకున్నాడు. అందరూ ధైర్యంగా ఉండాలని, బెయిల్ వచ్చేలా ఏర్పాట్లు చేస్తామని కేటీఆర్ వారికి ధైర్యం చెప్పారు. జైలులో ఉన్న ప్రతి ఒక్కరినీ బయటకు తీసుకురావడంతో పాటు మీ కుటుంబాలకు కేసీఆర్, బీఆర్‌ఎస్ అండగా నిలుస్తుందని భరోసా ఇవ్వడంతో బాధితులు సంతోషం వ్యక్తంచేశారు. అంతకు ముందు భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్ నుంచి సంగారెడ్డి వరకు కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. కంది ప్రధాన రహదారిపై పోలీసులు బారికేడ్లు వేసి జైలు సమీపంలోకి ఎవరూ రాకుండా అడ్డుకోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ జైలు గేటు వద్ద లగచర్ల రైతుల అరెస్టులకు వ్యతిరేకంగా నిరసనకు దిగారు. కాంగ్రెస్ సర్కార్, సీఎం రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.

కేటీఆర్ నిర్బంధానికి కుట్ర!

కనీసం ఆరు నెలలైనా ప్రజలకు దూరంచేసే వ్యూహం • లేని తప్పిదాలను వెతుకుతూ కేటీఆర్‌పై ఆరోపణలు

రేవంత్‌కు వంత పాడుతున్న బీజేపీ కేంద్ర మంత్రి, ఎంపీ • అధికారుల భుజంపై తుపాకీ పెట్టి పథకం అమలుచేసే కుయుక్తి

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారకరామారావును సుదీర్ఘకాలం జైలులో నిర్బంధించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నట్టు కనిపిస్తున్నది. జరుగుతున్న పరిణామాలు ఇవే సంకేతాలను ఇస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నుంచి కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అర్వింద్ దాకా పన్నుతున్న వ్యూహాలు, వేస్తున్న ఎత్తులు, వస్తున్న లీకులు వెరసి కేటీఆర్‌ను దీర్ఘకాలం ప్రజల నుంచి దూరం చేయాలన్న పట్టుదలను స్పష్టం చేస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఏర్పడినప్పటి నుంచి కేటీఆర్ ప్రతి అంశంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ శ్వేతపత్రం విడుదల చేస్తే బీఆర్‌ఎస్ స్వేదపత్రం విడుదల చేయటం మొదలు మూసీ, హైడ్రా దాకా, సుంకిశాల నుంచి కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్, అమృత్ స్కీమ్ దాకా ప్రతి అంశంలో కేటీఆర్.. బీఆర్‌ఎస్ శ్రేణులను నడిపిస్తున్న తీరు, ప్రజలు పార్టీ వైపు ర్యాలీ అవుతున్న వైనంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసహనంగా ఉన్నట్టు తెలుస్తున్నది. దీనికి బలమైన అడ్డుకట్ట వేసేందుకు రేవంత్‌రెడ్డి భారీ కసరత్తు చేస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లోనే చర్చ నడుస్తున్నది. అందులో భాగంగానే కేటీఆర్‌ను సుదీర్ఘకాలం నిర్బంధంలో ఉంచే వ్యూహానికి తెరలేపినట్టు తెలుస్తున్నది. పద్ధతి ప్రకారం ముందుగా ఒక్కొక్క అంశాన్ని లేవనెత్తుతూ ఆయనపై ఆరోపణలు చేయడం.. అవి నిజమేనని అనుకూల మీడియాతో చెప్పించడం, వాటికి సం బంధించిన నివేదికలు తమ వద్ద ఉన్నాయంటూ ప్రభుత్వ పెద్దలు వ్యాఖ్యానించడం అందులో భాగమేనని పరిశీలకులు పేర్కొంటున్నారు.

అంతా వ్యూహాత్మకమే

కనీసం అరడజనుకుపైగా అంశాల్లో కేటీఆర్ పేరును ప్రస్తావించడం, దాంట్లో ఏదో జరిగిందని, దానికి ఆయనే బాధ్యుడంటూ ఆరోపణలు చేస్తున్నారని, ఇదంతా వ్యూహాత్మకంగా జరుగుతున్నదేనని విశ్లేషకులు చెప్తున్నారు. ఫోన్‌ట్యాపింగ్, ఫార్ములా ఈ-రేస్, ధరణిలో అక్రమాలు, ఔటర్‌రింగ్‌రోడ్ టెండర్లు.. ఇలా అనేక అంశాల్లో అవినీతి ఆరోపణలు చేస్తూ.. కేటీఆర్ సహా బీఆర్‌ఎస్ మూల్యం చెల్లించుకోక తప్పదని సర్కార్ పెద్దలు వ్యాఖ్యానిస్తున్నారు. వాటికి కొనసాగింపుగా త్వరలో పొలిటికల్ బాంబు పేలుబోతున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సియోల్ వేదికగా చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ కుట్రకు మరింత ఊతమిస్తున్నాయి. పొంగులేటి వ్యాఖ్యల అనంతరమే ఫార్ములా ఈ-రేస్ తెరపైకి వచ్చింది. ఆ వెంటనే ఏసీబీ రంగంలోకి దిగటం, కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ అనుమతి కోసం లేఖ రాయటం శరవేగంగా జరిగిపోయాయి. ఇంతలో లగచర్ల ఘటన ప్రభుత్వానికి చేతికందిన అస్త్రంలా దొరికింది. లగచర్ల ఘటనలో బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టుచేసిన ప్రభుత్వం పనిలోపనిగా ఆయన రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేరును చేర్చింది. లగచర్ల ఘటనలో కేటీఆర్ హస్తం ఉన్నదంటూ ఆరోపించింది. దీనిని అడ్డంపెట్టుకొని 'కేటీఆర్‌ను ఎప్పుడైనా అరెస్టు చేయవచ్చు' అంటూ ప్రభుత్వ పెద్దల నుంచి లీకుల వెల్లువ మొదలైంది. అయితే, ఫార్ములా ఈ-రేస్‌లో అసలేం జరిగిందో కేటీఆర్ ఖుల్లంఖుల్లా బయటపెట్టిన సంగతి తెలిసిందే.

దీర్ఘకాలం జైలులో ఉంచాలన్నదే ప్లాన్

కేటీఆర్‌ను కనీసం ఆరు నెలల నుంచి ఏడాదైనా జైలులో ఉంచాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఎత్తుగడగా కనిపిస్తున్నది. కాంగ్రెస్ ఒక్కటే కేటీఆర్ గురించి మాట్లాడితే కక్షసాధింపు అన్న ప్రచారం జరుగుతుందని, బీజేపీతో కూడా మాట్లాడించాలని రేవంత్‌రెడ్డి బృందం భావిస్తున్నది. ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ కేటీఆర్‌పై విరుచుకుపడుతున్నారు. రేవంత్‌కు వంతపాడేందుకు తాజాగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కూడా చేరారు. అర్వింద్ వ్యాఖ్యలు కేటీఆర్ అరెస్టు తప్పదనే వాతావరణాన్ని రూఢీ చేస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఒక్కో అంశంలో ఒక్కో కేసు నమోదుచేస్తూ.. ఒక కేసులో బెయిల్‌పై బయటకొస్తే మరో కేసులో జైలుకు పంపేలా చూడాలని భావిస్తున్నట్టు సమాచారం. అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, ఎమ్మెల్యే వీరేశం వంటి వారు కేటీఆర్‌పై వేర్వేరు అంశాల్లో ఆరోపణలకు దిగుతున్నారు.

అదనుచూసి అరెస్టు?

ప్రభుత్వపెద్దలు చేస్తున్న వ్యాఖ్యలు, అనుసరిస్తున్న వైఖరి వెనుక పకడ్బందీ వ్యూహం ఉన్నదని విశ్లేషకులు భావిస్తున్నారు కేటీఆర్‌ను ఏ క్షణంలోనైనా అరెస్టు చేయవచ్చని లీకులు ఇచ్చి.. అనంతర పరిణామాలు తీవ్రరూపం దాల్చకుండా చూడాలన్నదే ప్రభుత్వం వ్యూహంగా కనిపిస్తున్నదని అంటున్నారు. అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి ఢిల్లీలో గవర్నర్ అనుమతి రాగా నే కేటీఆర్‌పై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. లగచర్ల ఘటనలో ఎవరు ఉన్నా వదిలేది లేదని సీఎం పేర్కొనడం, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు కేటీఆర్ అరెస్టు కోసం రంగం సిద్ధం చేసినట్టు స్పష్టమవుతున్నదని అంటున్నారు. 'శిక్ష తప్పదు కేటీఆర్. నువు ఫేస్ చేయాల్సిందే. అంటూ ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వేముల వీరేశం వంటివాళ్లు కూడా కేటీఆర్‌పై ఆరోపణలు చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి చేసిన అనేక ఆరోపణలను ఇప్పుడు తవ్వుతున్నట్టు తెలిసింది. పోలీసుల విచారణలో ఏవీ తేలకపోవడంతో నరేందర్‌రెడ్డి రిమాండు రిపోర్టులోనైనా కేటీఆర్ పేరుండేలా పోలీసులపై ఒత్తిడి చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.